సివిల్ సర్వీసుల్లో దివ్యాంగ కోటా ఎందుకు?

శారీరకంగా, దృఢంగా లేకుంటే ఎలా న్యాయం చేస్తారు! • ఎక్స్ వేదికగా సీనియర్ ఐఏఎస్ స్మితా సబర్వాల్

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ): సివిల్ సర్వీస్ ఉద్యోగాల్లో దివ్యాంగ కోటా ఎందుకు? ఇతర విభాగాల్లోని టెక్నికల్, ఆర్‌అండ్‌డీ, డెస్క్ జాబ్‌లు సరిపోతాయని రాష్ట్ర ఆర్థిక సంఘం కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ అభిప్రాయపడ్డారు. ఆదివారం ఎక్స్ వేదికగా చేసిన పోస్టులో ఈ విషయాన్ని వెల్లడించారు. దివ్యాంగులకు సివిల్ సర్వీస్ బాధ్యతలు సక్రమంగా నిర్వహించే సామర్థ్యం లేదని తెలిపారు. దివ్యాంగులంటే తనకు అపారమైన గౌరవం ఉన్నదని చెప్పారు. ఏదైనా విమానయాన సంస్థ పైలట్‌గా దివ్యాంగులను నియమిస్తుందా? ఒక దివ్యాంగ సర్జన్ వైద్యం చేస్తానంటే మీరు నమ్ముతారా? ఏఐఎస్ (ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్) ఉద్యోగం అంటేనే క్షేత్రస్థాయి పర్యటనలు, గంటల పాటు నిలబడటం, తమ వద్దకు వచ్చే ప్రజల సమస్యలను సావధానంగా వింటూ ఉండాల్సి ఉంటుంది. ఇందుకు శారీరకంగా దృఢంగా ఉండాలి. అలాంటి ఉద్యోగాల్లో దివ్యాంగ కోటా ఎందుకు?' అని ఆమె ప్రశ్నించారు. ఆర్మీ మాదిరిగానే ఏఐఎస్‌ది కూడా 'ఫీల్డ్ జాబ్' అని పేర్కొన్నారు. ఇది తెలివికి సంబంధించిన ఉద్యోగం మాత్రమే కాదని, విరివిగా పర్యటిస్తూ, ప్రభుత్వ పథకాలను అమలు చేస్తూ, ప్రజాసమస్యలను పరిష్కరించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ఉద్యోగ బాధ్యతల గురించి తనకు పూర్తిగా అవగాహన ఉన్నది కాబట్టే ఈ వ్యాఖ్యలు చేస్తున్నట్టు చెప్పారు.

సివిల్ సర్వీస్ గౌరవాన్ని మంటగలిపే యత్నం

సివిల్స్ కోచింగ్ నిర్వాహకురాలు బాలలత • సబర్వాల్ వ్యాఖ్యలకు వికలాంగుల సంఘాల నాయకుల ఖండన

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ): సివిల్ సర్వీస్ ఉద్యోగాల్లో దివ్యాంగ కోటా ఉండొద్దన్న సీనియర్ ఐఏఎస్ స్మితా సబర్వాల్ అభిప్రాయాన్ని సివిల్స్ కోచింగ్ సెంటర్ నిర్వాహకురాలు బాలలత ఒక ప్రకటనలో ఖండించారు. ఒక వర్గం మనోభావాలను దెబ్బతీయడంతోపాటు ఆలిండియా సర్వీసెస్ పట్ల ఉన్న గౌరవాన్ని మంటగలిపే ప్రయత్నంగా పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారులకు సరైన పనిచెప్తే, ఉద్యోగ బాధ్యతల్లో బిజీగా ఉంటారని, లేనప్పుడే ఇలాంటి నిర్లక్ష్యపూరిత వ్యాఖ్యలు చేస్తారని చెప్పారు. ఇటీవల బ్యూరోక్రాట్లకు పనిలేకుండా పోయింది' అని పేర్కొన్నారు. ఈ అంశంపై సోమవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. స్మితా సబర్వాల్ వ్యాఖ్యలపై దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్డీ) రాష్ట్ర కార్యదర్శి అడివయ్య, అధ్యక్షుడు వెంకట్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఆమెపై 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దివ్యాంగులను కించపరిచేలా ఎక్స్ వేదికగా అభిప్రాయాలు వ్యక్తం చేసిన ఐఏఎస్ స్మితా సబర్వాల్ వెంటనే దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు దివ్యాంగులను అవమానించడమేనని దివ్యాంగుల సలహాదారుల బోర్డు మెంబర్ నర్రా నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సివిల్ సర్వెంట్‌గా ఆమె అనర్హురాలని, ఆమెపై సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

మూసీ సుందరీకరణకు 1.5 లక్షల కోట్లా?

మొదటిపేజీ తరువాయి...

మురిసే రైతులెందరు? నిల్వ ఉంచే టీఎంసీలెన్ని? సాగులోకి వచ్చే ఎకరాలెన్ని? పెరిగే పంటల దిగుబడి ఎంత? తీర్చే పారిశ్రామిక అవసరాలెంత? కొత్తగా నిర్మించే భారీ రిజర్వాయర్లెన్ని?' అని ప్రశ్నల వర్షం కురిపించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకన్నా మూసీ ప్రాజెక్టుపైనే ఎందుకింత మక్కువ? అని ప్రశ్నించారు. చివరి దశలో ఉన్న పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పక్కనపెట్టి, మూసీ చుట్టే ఎందుకింత మంత్రాంగం అని మండిపడ్డారు. లండన్‌లోని థేమ్స్ నది లాగా మారుస్తామనే వ్యూహం వెనక థీమ్ ఏమిటని ప్రశ్నించారు.

కాంగ్రెస్ ధనదాహానికి నిదర్శనం

మూసీ సుందరీకరణకు మూడింతలు పెంచిన అంచనాలే కాంగ్రెస్ ధనదాహానికి సజీవ సాక్ష్యమని కేటీఆర్ ఉదహరించారు. మూసీ ప్రాజెక్టును చేపట్టాల్సిందే, సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో మాటల దశలోనే ఉన్న ప్రాజెక్టులో మూటలు పంచుకునే పని షురూ చేస్తే సహించబోమని తేల్చిచెప్పారు. తట్టెడు మన్ను తీయకముందే కోట్లు తన్నుకుపోయే కుట్రకు తెరతీస్తే సహించేది లేదని హెచ్చరించారు. మూసీ రివర్ ఫ్రంట్ పేరిట బ్యాక్ డోర్‌లో జరుగుతున్న బాగోతాన్ని తెలంగాణ సమాజం గమనిస్తున్నదని, కుంభకోణాల కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాతపెడుతుందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దాదాపు రూ. 3,866 కోట్లతో వందశాతం సీవరేజ్ ట్రీట్‌మెంట్ పూర్తిచేసిందని గుర్తుచేశారు. మూసీనది పునర్నిర్మాణం, సుందరీకరణ అభివృద్ధి ప్రణాళికను రూపొందించామని, అందుకు రూ. రూ.16,634 కోట్ల అంచనాలు రూపొందించామని (పశ్చిమవైపు (మంచిరేవుల) ఓఆర్‌ఆర్ నుంచి తూర్పు వైపు (ప్రతాపసింగారం) ఓఆర్‌ఆర్ వరకు ఎక్స్‌ప్రెస్ వేతో సహా), అయితే ఆ మొత్తాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ 10 రెట్లు పెంచాలని ఎలా నిర్ణయించుకున్నదని కేటీఆర్ ప్రశ్నించారు.

ఢిల్లీలో తెలంగాణ పరువు తీయకు

మొదటిపేజీ తరువాయి...

చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అవాకులు చెవాకులు మాట్లాడి మంత్రి తన అవగాహన రాహిత్యాన్ని మరోమారు బయటపెట్టుకున్నారని విమర్శించారు. మంత్రి వ్యాఖ్యలకు ఘాటుగా బదులిస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకవైపు మేడిగడ్డ పునాదిని బలపరిచేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని అంటూనే, మరోవైపు మేడిగడ్డ వద్ద మట్టి పరీక్షలు సాధ్యపడలేదని పొంతనలేని మాటలు చెప్తున్నారని ధ్వజమెత్తారు. వరదలు రాకముందే, జూలై మొదటి వారం లోపే పలు సాంకేతిక పరీక్షలు నిర్వహించాలని మే 5న ఇచ్చిన నివేదికలోనే ఎన్‌డీఎస్‌ఏ స్పష్టంగా తెలియజేసిందని గుర్తుచేశారు. జూన్ రెండో వారంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు సీడబ్ల్యూపీఆర్‌ఎస్, సీఎస్‌ఎంఆర్‌ఎస్‌లతో సాంకేతిక పరీక్షలు చేయించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందని, అయితే పరీక్షలకు ఉపక్రమించే సమయానికి వరదలు రావడంతో టెస్ట్‌లు ఆపివేసినట్టు మంత్రి పేర్కొంటున్నారని, ఆ వైఫల్యానికి ప్రధానంగా ఎన్డీఎస్ఏ, రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

ఎన్‌డీఎస్‌ఏ నిర్లక్ష్యం

బరాజ్ కుంగుబాటుకు గురికాగానే ఎన్‌డీఎస్‌ఏ 2023 అక్టోబర్ చివరలో హడావుడిగా ఎలాంటి పరిశీలనలు జరపకుండానే, భూభౌతిక పరీక్షల ఫలితాలు లేకుండానే, తెలంగాణ ఇంజినీర్లతో చర్చకుండానే అనేక లోపాలున్నాయని ఊహాతీత నివేదిక ఇచ్చిందని హరీశ్‌రావు మండిపడ్డారు. రెండుసార్లు పర్యటించిన ఎన్‌డీఎస్‌ఏ బరాజ్ పునరుద్ధరణకు ఏవైనా సూచనలు చేస్తుందని ఇంజినీర్లు ఆశించినా నిరాశే ఎదురైందని అన్నారు. ఎన్‌డీఎస్‌ఏ ఏర్పాటు అయిందే డ్యాంలు, బరాజ్‌ల సంరక్షణ కోసమని, ఆ సంస్థ మాత్రం అన్ని కేంద్ర సంస్థల మాదిరిగానే కేంద్ర ప్రభుత్వ పెద్దల ప్రయోజనాలను కాపాడే దిశగా పని చేస్తున్నదని, ప్రాథమిక నివేదిక ఆ తర్వాత ఆ సంస్థ నిర్లక్ష్య వైఖరే అందుకు నిదర్శనమని ఆరోపించారు. గత ప్రభుత్వంపైనా, తెలంగాణ ఇంజినీర్లపైనా బురద జల్లే ప్రయత్నమే తప్ప బరాజ్ పునరుద్ధరణకు నిర్మాణాత్మక సూచనలు చేయడంలో ఎన్‌డీఎస్‌ఏ విఫలమైందని ధ్వజమెత్తారు.

4 నెలల కాలం వృథా

గోదావరికి వరదలు రాకముందే బరాజ్‌కు సరైన రక్షణ చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏ నివేదిక కోసం ఎదురుచూస్తూ 4 నెలల విలువైన కాలాన్ని వృథా చేసిందని, ఇప్పుడేమో వరదల కారణంగా పరీక్షలు ఆపివేశామని చెప్పడం ప్రభుత్వం బాధ్యతారాహిత్యం కాదా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఈ వరదల్లో బరాజ్‌కు ఏదైనా ప్రమాదం వాటిల్లితే ఆ బాధ్యత ప్రభుత్వానిదేనని మండిపడ్డారు. వానాకాలం ముగిసేనాటికైనా ఎన్‌డీఎస్‌ఏ నుంచి శాశ్వత రక్షణ చర్యలకు సంబంధించిన నివేదికను తెప్పించుకోవడంపై ప్రభుత్వం శ్రద్ధ వహించాలని సూచించారు.

మంత్రి అవగాహన రాహిత్యం

గ్రావిటీ ద్వారా నీటిని తరలించేలా ప్రణాళికలు తయారుచేస్తున్నామని ఉత్తమ్ ప్రకటించడం ఆయన అవగాహన రాహిత్యాన్ని సూచిస్తున్నదని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. తుమ్మిడిహట్టి వద్ద బరాజ్ కట్టినా లిఫ్ట్ లేకుండా ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీళ్లు రాబోవనే విషయం మంత్రికి తెలిసి ఉండకపోవచ్చని, ప్రాజెక్టు ఇంజనీర్లను అడిగితే అక్కడ కూడా 40 మీటర్ల లిఫ్ట్ అవసరమని చెప్తారని చురకలంటించారు. తుమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మాణం చేయగలిగే పరిస్థితి ఉంటే, రీ ఇంజినీరింగ్ చేసే అవసరమే లేకుండా పోయేదని గుర్తుచేశారు. అక్కడ పరిష్కరించలేని సమస్యలున్న కారణంగానే తమ ప్రభుత్వ హయాంలోనూ 148 మీటర్ల వద్ద ఒప్పందం ఉన్నప్పటికీ బరాజ్‌ను నిర్మించలేకపోయామని, దానికి ప్రత్యామ్నాయంగా వార్ధా నదిపై బరాజ్‌ను ప్రతిపాదించామని వివరించారు. తుమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మించి తద్వారా ఆదిలాబాద్ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు సాగునీరివ్వాలని, మిగతా జిల్లాల అవసరాలకు కాళేశ్వరం ప్రాజెక్టును రూపకల్పన చేశామని, అయితే అనేక సాంకేతిక, పర్యావరణ సమస్యల కారణంగా తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ సాధ్యం కాని నేపథ్యంలో వార్ధా నదిపై తుమ్మిడిహట్టికి సుమారు 2 కిలోమీటర్ల ఎగువన వీర్దండి గ్రామం వద్ద బరాజ్ నిర్మాణాన్ని ప్రతిపాదించామని తెలిపారు. ప్రభుత్వానికి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు అందించాలన్న చిత్తశుద్ధి ఉంటే వార్ధా ప్రాజెక్టును వెంటనే చేపట్టి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

కాళేశ్వరంపై ఉత్తమ్ తప్పుడు లెక్కలు

తమ ప్రభుత్వం అధికారం కోల్పోయే నాటికి కాళేశ్వరం ప్రాజెక్టు మీద పెట్టిన వ్యయం సుమారు రూ. 94 వేల కోట్లు మాత్రమేనని, కాంగ్రెస్ ప్రభుత్వమే అసెంబ్లీలో ఈ విషయాన్ని ప్రకటించిందని, మరి లక్ష కోట్ల ప్రజాధనం అని ఉత్తమ్ ఆరోపించడంలో నైతికత ఎక్కడ ఉన్నదని మండిపడ్డారు. మేడిగడ్డ నుంచి 162.36టీఎంసీలను ఎత్తిపోశామని, చెరువులు, చెక్‌డ్యాంలు, శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల కింద 17 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించామని, కాళేశ్వరం ప్రాజెక్టు కింద 98 వేల కొత్త ఆయకట్టుకు సాగునీరందించామని హరీశ్‌రావు గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయి అన్ని పంపులు పని చేస్తే ఏడాదికి కరెంట్ చార్జీలే రూ. 10 వేల కోట్లు అవుతాయని, వడ్డీకి రూ. 15 వేల కోట్లు, విద్యుత్తు చార్జీలకు రూ. 10 వేల కోట్లు ఖర్చు కానుందని ఉత్తమ్ అవగాహన రాహిత్యంతో ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎత్తిపోతల పథకాలకు కరెంటు ఖర్చు తప్పనిసరని పేర్కొన్నారు. ఎత్తిపోతలు నిర్మించకపోతే తెలంగాణ కరువు ప్రాంతంగా, వలసల ప్రాంతంగా, రైతుల ఆత్మ హత్యలకు నిలయంగా మారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతుల ప్రయోజనాలు కాపాడండి

మేడిగడ్డ బరాజ్ కుంగుబాటు దురదృష్టకరమని, ప్రభుత్వం గానీ, ఇంజినీర్లు గానీ ఎవరూ అలాంటి ఘటన జరగాలని కోరుకోబోరని హరీశ్‌రావు తెలిపారు. అయితే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో ఏ లీకేజీలు లేవని పత్రికల్లో, మీడియాలో ప్రచారమైనట్టు అవి బుంగలు కావని, చిన్నపాటి నీటి లీకేజీలేనని తెలిపారు. ఇసుక పునాదిలో అటువంటి లీకేజీలు సహజమేనని తెలిపారు. 2022లో సంభవించిన వరద గోదావరి చరిత్రలోనే అతి పెద్దదని, మేడిగడ్డ బరాజ్ వద్ద 28 లక్షల క్యూసెక్కులకు పైబడి ప్రవాహం నమోదైందని గుర్తు చేశారు. బ్యారేజీ దిగువన సిమెంట్ బ్లాకులు అక్కడక్కడ లేచిపోయి ఉన్నందున చిన్న లీకేజీలు బుంగలుగా మారి రాఫ్ట్ కింద సొరంగం ఏర్పడేందుకు దోహదం చేసిందని పేర్కొన్నారు. బ్లాక్ 7లో రాఫ్ట్ కింద ఏర్పడిన ఆ సొరంగం 2023లో సంభవించిన భారీ వరదల అనంతరం అక్టోబర్ చివరి వారంలో మూడు పిల్లర్ల కుంగుబాటుకు కారణమైందని తెలుస్తూనే ఉన్నదని వివరించారు. అది దురదృష్టకరమేనని, భూభౌతిక పరీక్షల ద్వారా నిర్ధారణ కాకుండానే అనేక లోపాలు ఉన్నాయని ఆపాదించడం ఎన్‌డీఎస్‌ఏకు, మంత్రి ఉత్తమ్‌కు సమంజసం కాదని, రాజకీయాలు పక్కనబెట్టి బరాజ్‌ను పునరుద్ధరించి మళ్లీ వినియోగంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని వివరించారు. ఉత్తమ్ ఆ దిశగా శ్రద్ధ పెడితే రైతాంగానికి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మంచి జరుగుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వానికే పేరు వస్తుందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

ఏ ఎత్తు వద్ద తుమ్మిడిహట్టి బరాజ్ కడతారు?

తుమ్మిడిహట్టి వద్ద కొత్త ప్రాజెక్టు కడతామని మంత్రి ఉత్తమ్‌కుమార్ ప్రకటించడం సంతోషకరమని, తమ ప్రభుత్వం గతంలోనే 148 మీటర్ల ఎత్తు వద్ద బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించి, చారిత్రాత్మక ఒప్పందం చేసిందని గుర్తుచేశారు. అయితే తుమ్మిడిహట్టి వద్ద బరాజ్‌ను ఏ ఎత్తు వద్ద కడతారు? ఒప్పందం ప్రకారం 148 మీటర్ల వద్దనా? 152 మీటర్ల వద్దనా? అనేది మంత్రి ఉత్తమ్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. 2013లో మహారాష్ట్ర అప్పటి కాంగ్రెస్ సీఎం పృథ్వీరాజ్ చవాన్ రాసిన లేఖలోని అంశాలు మంత్రి ఉత్తమ్ మరోమారు చదువుకోవాలని, ఆ సూచనలను దృష్టిలో ఉంచుకొని తుమ్మిడిహట్టి బరాజ్‌పై నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

ప్రశ్నిస్తే దాడి చేయడమే ప్రజాపాలనా?

మాజీ మంత్రి వేముల

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ): ప్రశ్నించినవారిపై దాడులు చేయటమే ప్రజాపాలనా? అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సర్కార్‌ను ప్రశ్నించారు. భీంగల్ మండలం బెజ్జోరలో కాంగ్రెస్ నేతల ఇసుక అక్రమ రవాణాపై ప్రశ్నించిన బీఆర్‌ఎస్ కార్యకర్తపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనను ఒక ప్రకటనలో ఖండించారు. ఇసుక అక్రమ రవాణా దందాకు పాల్పడుతూ కాంగ్రెస్ నేతలు సర్కారు ఆదాయానికి గండికొడుతున్నారని ఆరోపించారు. ఇసుక అక్రమ రవాణా అడ్డుకుంటున్న ప్రతిపక్ష నేతలపై దాడులు, హత్యాయత్నాలకు తెగబడడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. రెవెన్యూ, పోలీసు అధికారులు ఇసుక మాఫియాతో చేతులు కలిపారని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. దాడులకు పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

• శాకాంబరిగా భద్రకాళి

వరంగల్ ప్రజల కొంగు బంగారమైన భద్రకాళి అమ్మవారు శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. 15 రోజులపాటు కనులపండువగా జరిగిన ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. అర్చకులు అమ్మవారిని ఐదు క్వింటాళ్ల వివిధ కూరగాయలతో అందంగా అలంకరించారు. శాకంబరి అలంకరణ, గురుపౌర్ణమి నేపథ్యంలో భద్రకాళి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. – వరంగల్

ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వాలి

- వెనుకబడిన జిల్లాలకు నిధులివ్వాలి
- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం నిర్మించాలి
- జిల్లాకో నవోదయ స్కూల్ కావాలి
- ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి డిమాండ్

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వాలని, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు కార్మాగారం నిర్మించాలని కేంద్ర ప్రభుత్వాన్ని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. వెనుకబడిన జిల్లాలకు నిధులు కేటాయించాలని, తెలంగాణలోని ప్రతి జిల్లా కేంద్రంలో నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని, ఇందుకు రాష్ట్ర కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. బీఆర్‌ఎస్ ఎంపీలుగా తాము ఉన్నప్పుడు చాలా అంశాలను పార్లమెంట్‌లో లేవనెత్తి రాష్ట్రానికి రావాల్సినవి సాధించుకున్నామని గుర్తుచేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు పదిహేను రోజులుగా కేంద్రానికి ఎలాంటి వినతిపత్రాలు ఇవ్వలేదని మండిపడ్డారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి ఒక్కరోజు మాత్రమే సమయం ఉన్నందున, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిధులు, ప్రాజెక్టులను సాధించుకోవాలని డిమాండ్ చేశారు.

విభజన సమస్యల పరిష్కారంలో మోదీ విఫలం

రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలపై దృష్టి పెట్టడంలో పదేండ్లుగా మోదీ ప్రభుత్వం విఫలమైందని వినోద్‌కుమార్ విమర్శించారు. మిత్రపక్షాలపై ఆధారపడి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన మోదీ ఐదేండ్ల పాలనకు ఈ బడ్జెట్ పునాది వంటిదని పేర్కొన్నారు. టీడీపీపై ఆధారపడి ప్రభుత్వాన్ని నడపాల్సి వస్తున్నందున ఏపీ కోస్తాతీరంలో 60 వేల కోట్లతో పెట్రో కెమికల్ ప్రాజెక్టుకు క్లియరెన్స్ వచ్చినట్టు వార్తలు వస్తున్నాయని తెలిపారు. ఏపీకి సీఎం చంద్రబాబు కొంత మేరకు నిధుల కేటాయింపు చేసుకుంటున్నట్టు తెలుస్తున్నదని పేర్కొన్నారు.



పెద్దపల్లి జిల్లా రామగుండంలోని 25వ డివిజన్‌లో స్థానిక మహిళలతో కలిసి బురదలో బైఠాయించి నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ నగునూరి సుమలత

అవినీతిపై ప్రశ్నిస్తే.. అభివృద్ధిని అడ్డుకుంటారా?

- ఎవరికైనా మేయర్ ఆచూకీ తెలిస్తే చెప్పాలి
- రామగుండంలో బురద నీటిలో బైఠాయించి మహిళా కార్పొరేటర్ నిరసన

కోల్‌సిటీ, జూలై 21: 'ప్రజా పాలన అంటే ఇదేనా? నగర పాలక సంస్థ మేయర్ ఆచూకీ తెలిస్తే జర చెప్పండి.. కార్పొరేషన్‌లో అవినీతిని ప్రశ్నించినందుకు మా డివిజన్‌లో అభివృద్ధిని అడ్డుకుంటారా? ప్రజాప్రతినిధికే విలువ లేని ఈ పాలనలో ప్రజలకు విలువ ఇస్తారా?' అంటూ పెద్దపల్లి జిల్లా రామగుండం 25వ డివిజన్ మహిళా కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు ఆగ్రహం వ్యక్తంచేశారు. మేయర్, అధికారుల తీరును నిరసిస్తూ ఆదివారం రామగుండంలో బురద నీటిలో బైఠాయించి నిరసన తెలిపారు. వర్షాన్ని సైతం లెక్కచేయక నడి రోడ్డుపై వరద నీటిలో కూర్చుని నినదించారు. తమ డివిజన్ పరిధిలో అభివృద్ధికి ఉద్దేశపూరితంగా నిధులు కేటాయించడం లేదని ఆరోపించారు. రెండేండ్ల క్రితం డివిజన్‌లోని పద్మావతి కాలనీలో రోడ్డు నిర్మాణం కోసం టెండర్ పిలిచారని, ఆ పనులు ప్రారంభించి మొదట్లోనే నిలిపివేశారని అన్నారు. 'ఇదేమిటని అడిగితే.. మీ డివిజన్‌లో రోడ్డు వేయొద్దని ఆదేశాలు వచ్చాయి' అని అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. దీనితో డివిజన్‌లో గుంతల రోడ్డు వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయనీ, కార్పొరేషన్‌కు ఈ డివిజన్ నుంచే అత్యధికంగా ఎల్‌ఆర్‌ఎస్ నిధులు వస్తున్నా అధికారులు కావాలనే నిధులు ఇవ్వడం లేదని మండిపడ్డారు. తమ డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపట్టకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఫిరాయింపుల చట్టాన్ని పటిష్టం చేయాలి

- నిపుణులతో కమిటీ వేయాలి
- కోర్టులకు వెళ్లకముందే చర్యలు తీసుకునేలా ఉండాలి
- అన్ని పార్టీలు, ప్రాంతాలను సమానంగా చూడాలి
- పార్లమెంట్ అఖిలపక్ష సమావేశంలో కేఆర్ సురేశ్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ): ఫిరాయింపులపై సంబంధిత పార్టీలు, సభ్యులు కోర్టుల మెట్లు ఎక్కకముందే నిర్ణయాలు తీసుకునేలా పటిష్ట వ్యవస్థను పార్లమెంట్ రూపొందించాలని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి కోరారు. ఇందుకోసం ఉభయ సభల్లో రాజ్యాంగం, చట్టాలు, ప్రజాస్వామ్య, పార్లమెంటరీ ప్రాతినిధ్య వ్యవస్థలపై అవగాహన, అనుభవం, నైపుణ్యం కలిగిన సభ్యులతో కమిటీ వేయాలని చెప్పారు. కమిటీ సూచనలు, ప్రతిపాదనలపై సమగ్రంగా చర్చించి ఫిరాయింపుల నిషేధ చట్టానికి సవరణలు చేసేలా ఈ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలని కోరారు. అలా చేస్తే డైమండ్ జూబ్లీ గణతంత్రానికి నిజమైన విలువ ఇచ్చినట్టు అవుతుందని పేర్కొన్నారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఆదివారం ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో కేఆర్ సురేశ్‌రెడ్డి పలు అంశాలు లేవనెత్తారు. దేశంలో రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75వ వసంతాలు పూర్తయి సంబురాలు జరుపుకొంటున్న నేపథ్యంలో ఆ పవిత్రకు విలువ ఇవ్వాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ ప్రతులు పట్టుకొని కొత్త ఎంపీలు ప్రమాణ స్వీకారం చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేస్తూ ప్రధాన రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఫిరాయింపుల నిషేధ చట్టంపై సవరణ తెస్తామని చెప్పి ఆ రాజ్యాంగానికే తూట్లు పొడుస్తున్నాయని ఉదహరించారు. వాజ్‌పేయిహయాంలో రాజ్యాంగ మార్పుపై వేసిన కమిటీ చేసిన ప్రధాన సూచన, 10వ షెడ్యూల్‌ను మార్చాలన్న అంశాన్ని ఆయన గుర్తుచేశారు. విలువల హననాన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత పార్లమెంట్‌పై ఉందని చెప్పారు. మణిపూర్ పార్టీ ఫిరాయింపుల విషయంలో సుప్రీం కోర్టు తీర్పు మన పార్లమెంటరీ వ్యవస్థకు చెంపపెట్టులాంటిదని ఉదహరించారు.

వ్యవసాయంపై ప్రత్యేక చర్చ అవసరం

దేశంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యవసాయ రంగంపై పార్లమెంట్ ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరముందని సురేశ్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. కనీస మద్దతు ధర, ఎరువులు, విత్తనాలు, పంట దిగుబడులు, ప్రాంతాలవారీగా నెలకొన్న అసమతుల్య వైరుధ్యాలపై సమగ్రంగా చర్చ జరగాల్సిన అవసరముందని సూచించారు. చిన్న, మధ్య తరహా పారిశ్రామిక (ఎంఎస్‌ఎంఈ) విధానంపైనా చర్చించాలని చెప్పారు.

విభజన సమస్యల పరిష్కారం ఎప్పుడు?

రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారానికి కేంద్రం ఇంకా ఎంతకాలం తీసుకుటుందని సురేశ్‌రెడ్డి ప్రశ్నించారు. 'ప్రాంతాలుగా విడిపోదాం. అన్నదమ్ములుగా పురోగమిద్దాం' అని ఉద్యమ సమయంలో కేసీఆర్ స్పష్టంగా చెప్పినట్టే రెండు ప్రాంతాల ప్రజల మధ్య సఖ్యతలో ఇబ్బంది లేదని, సమస్యల పరిష్కారంపైనే కేంద్రం నిర్లక్ష్యం వహిస్తున్నదనే అభిప్రాయం నెలకొన్నదని చెప్పారు. తక్షణమే చర్చకు అవకాశం ఇవ్వాలని, లేదంటే ఆ శాఖలకు డైరెక్షన్ ఇచ్చినా మంచిదేనని చెప్పారు. పార్లమెంట్ సమావేశాల్లో పార్టీ సభ్యుల సంఖ్యను బట్టి కాకుండా అంశం తీవ్రత బట్టి అవకాశం కల్పించాలని, వీలుకాని పక్షంలో కనీసం వారానికి రెండుసార్లు సభాపతి దగ్గర ఫ్లోర్ లీడర్లతో సమావేశం నిర్వహించి తాము లేవనెత్తే అంశాలకు పరిష్కార మార్గాలు చూపాలని కోరారు.

ఊర్కొండపేటలో సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తాం

- ప్రకటించిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
- 'నమస్తే' కథనానికి స్పందన

ఊర్కొండ, జూలై 21 : నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేటలో నెలకొన్న విద్యుత్తు సమస్యను పరిష్కరించేందుకు కొత్తగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నన్ని రోజులు తమకు ఏనాడూ విద్యుత్తు సమస్యలు లేవని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సమస్యలు తారస్థాయికి చేరాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట గ్రామస్థులు, రైతులు ఈనెల 18న జకినాలపల్లి సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. 'సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన' పేరిట ఈ నెల 19న 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. విషయం తెలుసుకున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి.. ఊర్కొండపేట గ్రామంలో విద్యుత్తు సమస్యను పరిష్కరించేందుకు సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్టు గ్రామస్థులకు హామీ ఇచ్చారు. తమ గ్రామ సమస్యను వెలుగులోకి తీసుకొచ్చి, పరిష్కారానికి కృషి చేసిన 'నమస్తే తెలంగాణ' దినపత్రికకు గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు.

నర్సింకు శేఖర్ మెమోరియల్ అవార్డు అందజేస్తున్న కే శ్రీనివాస్‌రెడ్డి

కార్టూనిస్టులను కాపాడుకోవాలి

- అంతరించిపోయే దశలో కార్టూన్ వృత్తి
- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

ఖైరతాబాద్, జూలై 21: కార్టూన్లు వేసే వృత్తి అంతరించిపోయే దశలో ఉందని, ఆ వ్యవస్థను బతికించుకోవాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కార్టూనిస్టు శేఖర్ మెమోరియల్ అవార్డు ప్రదానోత్సవ సభ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ రఘు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్‌రెడ్డి తెలంగాణ టుడే ఎడిటోరియల్ కార్టూనిస్టు పీ నర్సింకు కార్టూనిస్టు శేఖర్ మెమోరియల్ అవార్డును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతికారంగంలో ప్రూఫ్ రీడర్స్ వ్యవస్థ ఉండేదని, ఆ తరం అంతరించిపోయిందని, రిపోర్టర్లు, సబ్‌ఎడిటర్లే నేడు ఆ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 3వేల మంది జర్నలిస్టులకు ఇంటిస్థలాలు ఇచ్చే యోచనలో ఉన్న ట్టు తెలిపారు. నవతెలంగాణ పూర్వసంపాదకుడు ఎస్ వీరయ్య మాట్లాడుతూ సామాజిక స్పృహ కలిగిన కార్టూనిస్టు శేఖర్ అని, కార్టూనిస్టు నర్సిం కూడా అదే కోవకు చెందినవాడని కొనియాడారు. కార్యక్రమంలో కవి, జర్నలిస్టు ప్రసేన్, అరుణోదయ విమలక్క,హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యులు చలకాని వెంకట్‌యాదవ్, సాక్షి కార్టూనిస్టు శంకర్, చిత్రకారులు కూరెళ్ల శ్రీనివాస్, చంద్రకళా శేఖర్ పాల్గొన్నారు.

అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించాలి

- విద్యుత్తు సంస్థల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి
- తెలంగాణ రాష్ట్ర పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్

హైదరాబాద్, జూలై 21 (నమస్తే తెలంగాణ): అసోసియేషన్ ఎన్నికలు జరపాలని, విద్యుత్తు సంస్థల్లో బదిలీలు, ప్రమోషన్లు కల్పించడంతోపాటు ఈపీఎ నియామకం చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ (టీజీపీఈఏ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. టీజీపీఈఏ జనరల్ బాడీ సమావేశం ఆదివారం హైదరాబాద్‌లోని టీజీ జెన్‌కో ఆడిటోరియంలో నిర్వహించారు. రామగుండం ప్లాంట్ 62.5 మెగావాట్ల స్థానంలో 8 మెగావాట్ల కొత్త ప్లాంట్‌ను టీజీ జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో టీజీపీఈఏ అధ్యక్షుడు రత్నాకర్‌రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకటనారాయణ రెడ్డి, సెక్రటరీ జనరల్ సదానందం, అడిషనల్ సెక్రటరీ జనరల్ అంజయ్య, చీఫ్ అడ్వైజర్ శివ శంకర్, అడ్వైజర్ మంగీలాల్, ఏఐపీఈఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనాథ్‌రెడ్డి, టీజీఎస్పీడీసీఎల్ సెక్రటరీ జనరల్ జనప్రియ, సెక్రటరీ సామ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.